శృంగార వీధి

ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి

# లాజిక్

మెగా సిటీలోని ఒక మెయిన్ రోడ్డులో వున్న పదకొండు అంతస్తుల కాంప్లెక్స్ ఏడో అంతస్తులో వుంది. ఓ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ.

తన కాబిన్‌లో 'పెంటియం' కలర్ మానిటర్ ముందు కూచుని ఉదయం నుంచి తంటాలు పడుతున్నాడు రఘు.

ఏ ప్రోగ్రాం చేయాలన్నా తనకింత టైమ్ పట్టదు.

అలాంటిది గతవారం రోజులుగా అవస్థ పడుతున్నాడు.

నిజానికీ ప్రోగ్రాం చాలా సింపుల్. హఠాత్తుగా కాంప్లికేటెడ్ అయింది.

అంటే ఎక్కడో లాజిక్ ఘోరంగా దెబ్బతింది.

లాజిక్... ఎంత గింజుకున్నా మెమరీ పవర్ లోంచి అందడం లేదు.

తను రాసిన ప్రోగ్రామ్ ప్రింట్ అవుట్ పదిసార్లు తీసి చూశాడు.



అన్నీ సరిగ్గానే వున్నాయి.

కానీ ప్రోగ్రామ్ మాత్రం 'రన్' కావటం లేదు.

ఎక్కడో లాజిక్ మిస్సయింది.

ఏమీ తోచక చుట్టూ చూశాడు.

ఆఫీసులో సీట్లన్నీ ఖాళీగా వున్నాయి.

టైమ్ చూశాడు. రాత్రి ఏడు కావొస్తోంది.

తల బరువుగా అనిపించింది.

సీట్లో వెనక్కి వాలి కూచున్నాడు.

ఒక్కటే పదం మెదడులో ప్రతిధ్వనిస్తోంది.

లాజిక్... లాజిక్... లాజిక్.

హఠాత్తుగా ఒకటి స్ఫురించింది.

ఆ లాజిక్‌ని మరేదో కవర్ చేస్తోంది.

ఏమిటది??

ఆలోచనలు క్రమంగా విస్తరిస్తున్నాయి.

గతవారం రోజులుగా తను 'డిస్టర్బ్‌డ్'గా వున్నాడు.

అందుకు కారణం

మోహన...!

సరిగ్గా ఆరు నెలల క్రితం...

✣ ✣ ✣

పెళ్ళిచూపుల్లో సమ్మోహనంగా వున్న 'మోహన' సౌందర్యం రఘుని కట్టిపడేస్తే, ఇచ్చిపుచ్చుకోవడాలు తల్లిదండ్రులకు నచ్చాయి.

మల్లెల మాసంలో పెళ్లికి లగ్నం పెట్టారు.

ఆత్మసాక్షిగా మూడు ముళ్లు వేశాడు.

అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిచాడు.

మధురానుభూతుల మూడు రాత్రుల పర్వంలో మన్మథశాస్త్రానికి ఆధునికభాష్యం చెప్పుకున్నారు మోహన, రఘు.

తొలిముద్దు తీవ్రతని కొలవడానికి 'ఆసియాలో మీటర్' శక్తి కూడా చాలదు.

తొలి కౌగిలింతలో ఉత్పన్నమైన 'విద్యుత్తు'ని ఏ ట్రాన్స్‌ఫార్మర్లూ భరించలేవు.

తొలి పులకింతల వెల

ఏ నాటికీ

అమూల్యమే!

కోరిక తమకమై,

తమకం తాపమై

ఆ తాపం

పడగలెత్తి
శరీరాలు విరిశరాలుగా
ఒకరినొకరు అనుసంధానిస్తూ, మమేకమై
నవ్యశృంగారసామ్రాజ్యాన్ని
ఆవిష్కరించుకున్నారు

రఘు ఉద్రేకంలో, మోహన ఉత్సాహంలో సంసారసుఖంలో నిముషాలు, గంటలు, రోజులు కరిగిపోతున్నాయి.

అయితే-

ఎంత అమృతమైనా కొంత కాలానికి వెగటు పుడుతుంది.

మోహన విషయంలోనూ అదే జరిగింది.

శరీరానికి కోరిక తీరుతున్నా, మనసు మాత్రం మరేదో కావాలంటోంది.

ఓ రోజు-

త్వరగా యింటికి వచ్చిన రఘు "ఎంతో కష్టమైన ప్రోగ్రామ్‌ని త్వరగా పూర్తి చేసి నీ కోసమే వచ్చాను తెలుసా?" గొప్పగా అన్నాడు.

"అయితే అలా బైటికి వెడదామండి" అడిగింది మోహన.

"......"

"సినిమాకి వెడదామండి."

"వద్దులెద్దూ. మూడు గంటలు బోర్! అంతకన్నా ఇంట్లోనే బాగా 'ఎంజాయ్' చెయ్యచ్చు" అన్నాడు రఘు.

"పోనీ గుడికి వెడదాం."

"గుళ్లూ, గోపురాలూ వయసైపోయిన వాళ్లకి మాత్రమే మోహనా!" అంటూ నవ్వేశాడు.

అడిగిన ప్రతిదానికీ ఏదో సాకులు చెబుతూనేవున్నాడు రఘు.

"ఈ ఆనందం మనకి కొన్నాళ్లేకదా! సినిమాలు, పార్కులు, గుళ్లు ఎక్కడికీ పోవు. పిల్లలు పుడితే అంతా గందరగోళమే. అప్పుడు చూద్దాములే అవన్నీ. అందాకా మన పని 'ఇదే!' " అంటూ మోహనని దగ్గరికి తీసుకున్నాడు ఆ రాత్రి.

మొదటిసారిగా అతనికి మనస్ఫూర్తిగా సహకరించలేకపోయింది మోహన.

ఆ తేడా గమనించలేకపోయాడు రఘు.

కేలెండర్లో నెలలు మారుతున్నాయి.

సంసారసౌఖ్యమంటే 'మూసేసిన గది తలుపుల మధ్యన మాత్రమే' అన్న ధోరణి మార్చుకోలేకపోయాడు రఘు.

'భార్యని సుఖపెట్టడమంటే ఇదే' అని మోహనతో వాదించి తన 'పని' తాను చూసుకునేవాడు.




తన శరీరంతో తప్ప తన మనసుతో పని లేని రఘుని ఎదిరించింది ఓ రోజు.

"సుఖమంటే కేవలం శరీరానికి మాత్రమే కాదు... మనసుకు కూడా కావాలి. మనసులేని సుఖానికి పెళ్లే అవసరం లేదు. అప్పుడు అనురాగానికి అర్థం లేదు... అనుబంధానికి అవకాశం లేదు. అలాంటి సంసారం నాకు అవసరం లేదు. ఈ లాజిక్ మీరు గ్రహించిననాడే నేను తిరిగి వస్తాను" అనేసి తన పుట్టింటికి వెళ్లిపోయింది మోహన.

పంతంతో తను ముందుకు వెళ్లలేదు రఘు.

ఐదు నెలల వైవాహికజీవితంలో అడ్డుగోడ లేచింది.

✣ ✣ ✣

ఈ వారం రోజులూ అశాంతిగానే గడిపాడు.

ఆఫీసు పనిమీద మనసు లగ్నం కాలేకపోయింది.

అతికష్టంగా ప్రోగ్రామ్‌లు రాస్తున్నాడు.

కాని ఎన్నాళ్లిలా?

ఏదో తెలియని వెలితి!

ఆవేశం తగ్గింది.

ఆలోచన మొదలయింది.

అసలు తన భార్య మాటల్లో తప్పేముంది?

"సుఖమంటే కేవలం శరీరానికి మాత్రమే కాదు... మనసుకి కూడా కావాలి."

మోహన చెప్పిన దాంట్లో కూడా 'లాజిక్' వుంది.

లాజిక్ కుదరకపోతే ప్రోగ్రామే కాదు.. సంసారమూ నడవదు...

మనసు తేలికపడింది.

మెదడులో మెరుపు మెరిసింది!

అంతే!

హఠాత్తుగా, వారం రోజుల నుంచి తన బుర్ర తింటున్న ప్రోగ్రామ్‌లో అవసరమైన లాజిక్ దొరికింది.

క్షణాల్లో ప్రోగ్రామ్ రన్ అయింది.

ఉత్సాహం రెట్టింపయింది.

వెంటనే తన బాస్ దగ్గరికెళ్లి అర్జెంటుగా సెలవు కావాలని శాంక్షన్ చేయించుకున్నాడు.

ఆ రాత్రే బయలుదేరాడు రఘు, తన అత్తవారింటికి-

అతని కళ్ల ముందు-

సర్వాంగసుందరంగా మోహన ప్రత్యక్షమయింది!!! ■